# జనరంజకంగా మేనిఫెస్టో

- పేదలకు కేసీఆర్ బీమా.. రైతుబంధు రూ.16వేలకు పెంపు
- పింఛన్ పెంపు.. మహిళలకు రూ.3 వేలు సౌభాగ్యలక్ష్మి
- రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం, రూ.400కే గ్యాస్ సిలిండర్
- ఆరోగ్యశ్రీ గరిష్ట పరిమితి రూ.15 లక్షలకు పెంపు
- బీఆర్ఎస్ మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం



న్యాల్‌కల్: డప్పూర్‌లో సీఎం కేసీఆర్ మేనిఫెస్టోను టీవీలో వీక్షిస్తున్న బీఆర్ఎస్ నేతలు, ప్రజలు

సంగారెడ్డి, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ మేనిఫెస్టో ద్వారా రాష్ట్ర ప్రజలకు వరాలు ప్రకటించారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు, జర్నలిస్టులు ఇలా సమాజంలోని అన్ని వర్గాల వారు లబ్ధిపొందేలా మేనిఫెస్టోను రూపొందించారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రజలతోపాటు పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావటానికి మేనిఫెస్టో బాటలు వేస్తుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోతో సంగారెడ్డి జిల్లాలోని అన్ని వర్గాలు లాభపడనున్నాయి.

#### 4లక్షల మంది రైతులకు లాభం

సీఎం కేసీఆర్ ప్రతిఏటా రైతులకు రైతుబంధు ద్వారా ఎకరాకు రూ.10వేల పెట్టుబడిసాయం అందజేస్తున్నారు. తాజాగా మేనిఫెస్టోలో రైతుబంధు మొత్తాన్ని రూ.16వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది రైతుబంధు రూ.12వేలకు పెంచుతారు. ఆ తర్వాత క్రమంగా రాబోయే ఐదేళ్లలో రూ.16వేలకు చేరుకుంటుంది. జిల్లాలో ఇప్పటివరకు ప్రభుత్వం పది విడతలుగా రైతులకు రూ.3,270.44 కోట్లు పెట్టుబడిసాయం అందజేసింది. రైతుబంధు పెంపు నిర్ణయంతో జిల్లాలోని సుమారు 4 లక్షల మందికిపైగా రైతులకు లాభం చేకూరనుంది. 2023 వానాకాలం సీజన్‌లో 3,59,010 మంది రైతులు రూ.375కోట్ల పెట్టుబడి సాయం పొందారు. కొత్త పాసు పుస్తకాల జారీ, భూముల కొనుగోలుతో వచ్చే ఏడాది నాటికి పెట్టుబడిసాయానికి 4 లక్షల మంది అర్హులు కానున్నారు.

#### 3.52 లక్షల తెల్ల రేషన్‌కార్డుదారులకు మేలు

జిల్లాలో 2,08,503 మంది రైతులకు రైతు బీమా పథకం వర్తిస్తున్నది. తాజాగా సీఎం కేసీఆర్ అన్నివర్గాల వారి కోసం కేసీఆర్ బీమా పథకం ప్రకటించారు. జిల్లాలో 3,52,483 తెల్లరేషన్‌కార్డులున్నాయి. వీరందరికీ కేసీఆర్ బీమా వర్తించనున్నది. కార్డుల్లో పేర్లు ఉన్న 11,67,428 మంది కేసీఆర్‌బీమా పొందనున్నారు. ఏదైనా కారణాలతో లబ్ధిదారులు చనిపోతే వారి నామినీలకు రూ.5 లక్షల బీమా సొమ్ము అందజేస్తారు.

#### పెన్షన్ పెంపు.. 77 వేల మందికి లబ్ధి

ఆసరా పెన్షన్‌ను రూ.5వేలకు పెంచుతున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. మొదట రూ.3వేలకు పెంచి ఆ తర్వాత క్రమంగా రూ.5వేలకు పెంచనున్నారు. ఆసరా పెంపు నిర్ణయంతో జిల్లాలో 62,072 మంది లాభం చేకూరనున్నది. దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచనున్నట్లు ప్రకటించారు. జిల్లాలో ఇదివరకే 15,016 మంది దివ్యాంగులు రూ.4వేల పెన్షన్ తీసుకుంటున్నారు. తాజా నిర్ణయంతో వీరి పెన్షన్ రూ.6వేలకు పెరగనుంది. పెన్షన్ పెంపు నిర్ణయంతో దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

#### రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం

అన్నపూర్ణ పథకం ద్వారా రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేయనున్నారు. జిల్లాలో మొత్తం 3,78,789 రేషన్‌కార్డు లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా 7922 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వం అందజేస్తున్నది. వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వం రేషన్‌కార్డు లబ్ధిదారులందరికీ సన్నబియ్యం ఇవ్వనున్నది. దీంతో 12 లక్షల మంది రేషన్‌కార్డు లబ్ధిదారులు సన్న బియ్యంతో భోజనం చేయనున్నారు. జిల్లాలో 3,52,483 తెల్లరేషన్‌కార్డులు, 26,206 అంత్యోదయ, 100 అన్నపూర్ణ కార్డులున్నాయి.

#### రూ.400కే గ్యాస్ సిలిండర్

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను అమాంతం పెంచటంతో గ్యాస్ కనెక్షన్ ఉన్న కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. దీనిని గమనించిన సీఎం కేసీఆర్ మరోమారు అధికారంలోకి రాగానే సబ్సిడీపై రూ.400కే మహిళలకు, జర్నలిస్టులకు గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో జిల్లాలోని మహిళలు, జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 5,66,858 మందికి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో అర్హులైన మహిళలు, అక్రిడిటేషన్ జర్నలిస్టులకు ప్రభుత్వం రూ.400కు గ్యాస్ సిలిండర్ అందజేయనున్నది.

#### ఆరోగ్యశ్రీ.. రూ.15 లక్షలకు పెంపు

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా సీఎం కేసీఆర్ ఆరోగ్యశ్రీ గరిష్ట బీమా పరిమితిని రూ.15 లక్షలకు పెంచనున్నట్లు ప్రకటించారు. దీంతో జిల్లాలోని పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు మరింతగా అందుబాటులోకి రానున్నాయి. జర్నలిస్టులకు సైతం ఇదే పథకం వర్తింపజేయనున్నారు. తాజాగా ప్రకటించిన ఆరోగ్యశ్రీ పథకంతో జిల్లాలో 610 మందికిపైగా జర్నలిస్టులకు లబ్ధి చేకూరనున్నది.

#### మహిళలకు 'సౌభాగ్యలక్ష్మి'

పేద మహిళల కోసం సీఎం కేసీఆర్ సౌభాగ్యలక్ష్మి పథకం ప్రకటించారు. ఈ పథకం ద్వారా అర్హులైన పేద మహిళలకు రూ.3,000 జీవన భృతి ఇవ్వనున్నారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న మహిళలకు ఈ పథకం వర్తించనుంది.

#### పేదలకు ఉచితంగా ఇండ్ల స్థలాలు

అర్హులైన పేదలకు ఉచితంగా ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీఎం కేసీఆర్ మేనిఫెస్టోలో ప్రకటించారు. దీంతో ఇంటి జాగా లేని పేదలకు ఇంటి స్థలాలు దక్కనున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఉన్న మైనార్టీ గురుకుల కళాశాలలను డిగ్రీ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. అలాగే అవసరమైన చోట మహిళా సంఘాలకు స్త్రీశక్తి భవనాలను నిర్మించనున్నారు. అగ్రవర్ణాల్లోని పేదల కోసం ఐదు నియోజకవర్గాల్లో ఒక్కో గురుకుల కళాశాలలను ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగులకు సైతం సీఎం కేసీఆర్ శుభవార్త వినిపించారు. ఉద్యోగులు కోరుకుంటున్న ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఉన్నతాధికారులతో కమిటీ వేయనున్నట్లు ప్రకటించారు. సీఎం ప్రకటనతో జిల్లాలోని ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### అన్ని వర్గాల అభ్యున్నతికి తోడ్పాటు



గుమ్మడిదల: రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అందరికీ సముచిత న్యాయం చేస్తుంది. ఆసరా పెన్షన్లు, రైతుబంధు, మహిళల కోసం స్కీమ్‌లు, అర్హులైన మహిళలకు భృతి అందిస్తానని హామీ ఇవ్వడం హర్షణీయం. మహిళా సమాఖ్య భవనాలు ఏర్పాటు చేస్తానని చెప్పడం గర్వంగా ఉంది. తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, కేసీఆర్ బీమా, ఆరోగ్యశ్రీ పెంపు, అగ్రవర్ణాలకు రెసిడెన్షియల్ స్కూళ్లు, అసైన్డ్ భూములపై ఆంక్షల ఎత్తివేత, ఉద్యోగులకు సీపీఎస్‌పై అధ్యయన కమిటీలు ఏర్పాటుపై రాష్ట్ర ప్రజలు సంతోషిస్తున్నారు.

– ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్, బొంతపల్లి, గుమ్మడిదల

### అగ్రకులాల్లోని పేదల పెన్నిధి

అగ్రకులాల్లోని పేదల పిల్లల కోసం గురుకులాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుడుతున్న సీఎం కేసీఆర్ గొప్ప మనసుకు జోహార్లు. అగ్రకులాల్లో పొట్టగడవని కుటుంబాలెన్నో ఉన్నాయి. అగ్రకులాల్లోని పేద విద్యార్థులకు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడం గొప్ప పరిణామం. పేదల పెన్నిధిగా కేసీఆర్ మరోమారు ముఖ్యమంత్రి పదవిలో కూర్చోవడం ఖాయం.

– హన్మంత్‌రావు, అర్చకుడు, కల్హేర్

### రైతులకు బంగారు బాటలు



రాయికోడ్: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు బంగారు బాటలు వేసేవిధంగా మేనిఫెస్టో విడుదల చేశారు. గతంలోనే రైతుల కష్టాలను చూసిన సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు తీసుకువచ్చారు. అందోల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా చంటి క్రాంతికిరణ్‌ను రెండోసారి భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– నాజింపాటిల్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి

### ప్రజలు మెచ్చేలా మేనిఫెస్టో



కంది : ప్రజలు మెచ్చేలా.. ప్రతిపక్ష పార్టీలు ఊహించని విధంగా బీఆర్ఎస్ మేనిఫెస్టోను సీఎం కేసీఆర్ ప్రకటించారు. సీఎం కేసీఆర్ ప్రజల మనిషి, ఇచ్చిన మాటకు కట్టుబడే నాయకుడు. ఆసరా పింఛన్లు రూ.5వేలు, దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచడం హర్షణీయం. రైతుబంధు రూ.16 వేలు, పేద మహిళలకు రూ.400లకే గ్యాస్ సిలిండర్, తెల్లరేషన్ కార్డున్న వారందరికీ కేసీఆర్ బీమా, సౌభాగ్యలక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు రూ.4 వేల భృతి ఇలా ఎన్నో పథకాలను మేనిఫెస్టోలో పెట్టి అమలు చేసే దమ్మున్న నేత మా కేసీఆర్. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరు. బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలిచి అధికారం చేపట్టడం ఖాయం. మూడోసారి సీఎంగా కేసీఆర్ ప్రమాణస్వీకారం చేయడం ఖాయం.

– కొండల్‌రెడ్డి, జడ్పీటీసీ, కంది

---

# బీసీలకు మొండి 'చేయి'

- తొలి జాబితాలో బీసీలకు దక్కని సీట్లు
- టికెట్ల కేటాయింపుపై కాంగ్రెస్‌లో అసంతృప్తి
- క్యాడర్‌లో అయోమయం

సంగారెడ్డి, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ కంటే బీసీలకు ఎక్కువ సీట్లు ఇస్తామని గొప్పలకుపోయిన కాంగ్రెస్ ఉమ్మడి మెదక్ జిల్లాలో బీసీలకు టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వలేదు. ఆదివారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలకు ఐదుగురు అభ్యర్థులను ప్రకటించింది. రెండు ఎస్సీ రిజర్వుడ్, ఆరు జనరల్ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్.. జనరల్ స్థానాల్లో బీసీల్లో ఒక్కరికీ టికెట్ ఇవ్వలేదు. టికెట్ రాని అభ్యర్థులు ఎన్నికల్లో పనిచేసే అవకాశాలు కనిపించడం లేదు. కాంగ్రెస్‌లో సీనియర్‌గా పేరున్న నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన సురేశ్ షెట్కార్ పేరు తొలిజాబితాలో లేకపోవడంతో ఆయన అనుచరుల్లో అసంతృప్తి నెలకొన్నది.

#### బీసీల్లో అసంతృప్తి

ఉమ్మడి మెదక్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలకు ఐదు చోట్ల అభ్యర్థులను ప్రకటించి మిగతా స్థానాల్లో అభ్యర్థుల ప్రకటనను పెండింగ్‌లో పెట్టింది. కాంగ్రెస్ నుంచి అందోలు స్థానానికి దామోదర రాజనర్సింహ(ఎస్సీ), సంగారెడ్డి నుంచి తూర్పు జయప్రకాశ్‌రెడ్డి(ఓసీ), గజ్వేల్ నుంచి తూంకుంట నర్సారెడ్డి(ఓసీ), జహీరాబాద్ ఎ.చంద్రశేఖర్(ఎస్సీ), మెదక్ టికెట్ మైనంపల్లి రోహిత్(వెలమ)కి ప్రకటించింది. ఐదు స్థానాల్లో ఒక్క బీసీకి టికెట్ ఇవ్వకపోవడంతో ఆ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

#### సొంత పార్టీలోనూ అసంతృప్తి జ్వాలలు

జహీరాబాద్ నియోజకవర్గంలో స్థానికులకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్‌లోని ఎస్సీ నేతలు అధిష్ఠానాన్ని కోరుతూ వచ్చారు. స్థానిక నాయకులు నరేశ్, నర్సింలు, గోపాల్ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం స్థానికులను కాదని స్థానికేతరుడైన డాక్టర్ ఎ.చంద్రశేఖర్‌కు టికెట్ కేటాయించడంతో జహీరాబాద్ కాంగ్రెస్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మెదక్ నియోజకవర్గంలో స్థానిక కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో టికెట్ ఆశించారు. అయితే పార్టీ అధిష్ఠానం మైనంపల్లి హన్మంతరావు కొడుకు మైనంపల్లి రోహిత్‌కు టికెట్ ఇస్తుందని తెలియడంతో ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ అధిష్ఠానం మైనంపల్లి రోహిత్‌కు టికెట్ ఇవ్వడాన్ని స్థానిక సీనియర్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. మేడం బాలకృష్ణతోపాటు ఇతర నాయకులు పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పనిచేసే అవకాశాలు ఉన్నాయి. గజ్వేల్ టికెట్ కోసం 11 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్‌కు చెందిన జశ్వంత్‌రెడ్డి, బండారు శ్రీకాంత్‌రావు టికెట్ ఆశించారు. అధిష్ఠానం నర్సారెడ్డికి టికెట్ ప్రకటించడంతో ఆ ఇద్దరు నేతలు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తున్నది.

#### ఆ స్థానాల్లో టికెట్లు ఎవరికో?

సంగారెడ్డి, నారాయణఖేడ్, నర్సాపూర్, దుబ్బాక, సిద్దిపేట ఎమ్మెల్యే అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించలేదు. ఆయా స్థానాల్లో టికెట్ కోసం ఆశిస్తున్న నేతలు ఢిల్లీలో మకాం వేసి ప్రయత్నాలు చేస్తున్నారు. నారాయణఖేడ్‌లో సీనియర్ నేత షెట్కార్ తనకు తొలి జాబితాలో టికెట్ ప్రకటిస్తారని ఆశించారు. అధిష్ఠానం టికెట్ ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టడంపై ఆయన అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. నారాయణఖేడ్ నుంచి మరో నాయకుడు సంజీవరెడ్డి ఎమ్మెల్యే టికెట్ కోసం పట్టుబడుతున్నారు. దీంతో ఇక్కడ ఎవరికి టికెట్ ఇవ్వాలన్న అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఉమ్మడి మెదక్ జిల్లాలో కొద్దిరోజులుగా కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి విపరీతంగా చేరికలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు టికెట్ల పంచాయతీ మొదలు కావడంతో ఎన్నికల్లో విజయావకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

### స్టీల్ మర్చంట్‌లో అగ్నిప్రమాదం



బాధితులను పరామర్శిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి

ములుగు, అక్టోబర్ 15: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో స్టీల్ మర్చంట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.20లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటన మండల పరిధిలోని వంటిమామిడిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వంటిమామిడికి చెందిన శ్రీనివాస్ 20 ఏండ్లుగా స్టీల్ మర్చంట్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా భారీ మంటలు చెలరేగడంతో మర్చంట్‌లోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ. 20లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. విషయం తెలుసుకున్న డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేశ్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ నిమ్మకాయల గణేశ్ ఉన్నారు.